నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 66 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
27-12-2025 శనివారం వెల : 1/- పేజీలు : 4

# భూ కష్టాలకు విముక్తి.. '22ఏ' సమస్యలకు సత్వర పరిష్కారం!

- గ్రీవెన్స్‌లో 90 శాతం రెవెన్యూ అంశాలే..
- ఇకపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు
- ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో అధికారులకు క్షేత్రస్థాయి అధికారాలు
- మంత్రి అచ్చెన్నాయుడు

**నవతరం - శ్రీకాకుళం**

ప్రజలు తమ చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఇకపై ఉండదు. ముఖ్యంగా 22ఏ భూ సమస్యల నుంచి రైతులకు, సామాన్యులకు విముక్తి కలిగించి, వారి భూమిపై వారికి పూర్తి హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. శు క్రవారం శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీ చేతికి మీ భూమి - 22ఏ భూ స్వేచ్ఛ' ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని 10 గంటల పాటు ఏకధాటిగా ఫిర్యాదులు స్వీకరించారు. సాధ్యమైనంత వరకూ వాటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు.

## క్షేత్రస్థాయిలోనే పరిష్కారం

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌కు వస్తున్న వినతుల్లో 90 శాతం రెవెన్యూ సంబంధిత సమస్యలే ఉంటున్నాయని గుర్తు చేశారు. వీటిని పరిష్కరించేందుకు విఆర్ఓ స్థాయి నుంచి కలెక్టర్ వరకు యంత్రాంగమంతా ఒకే చోట చేరి ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

భూ సమస్యలను శాశ్వతంగా తగ్గించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి తహసిల్దార్లకు, ఆర్డీవోలకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తూ జీవో జారీ చేశారని తెలిపారు.

ముఖ్యమంత్రి స్వయంగా ప్రతిరోజూ తన లాగిన్ ద్వారా ఈ సమస్యల పరిష్కార పురోగతిని పర్యవేక్షిస్తున్నారని, న్యాయపరమైన చిక్కులు ఉన్నవి మినహా మిగిలిన ప్రతి సమస్యను పరిష్కరించి



రికార్డులను అప్‌డేట్ చేయాలని ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు. గతంలో అనేక గ్రామాలు మొత్తం 22ఏ పరిధిలోకి వెళ్లాయని, వాటిని కూడా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## లబ్ధిదారుల హర్షాతిరేకాలు

ఈ ప్రత్యేక గ్రీవెన్స్‌లో భాగంగా మంత్రి చేతుల మీదుగా పలువురు లబ్ధిదారులకు భూ విముక్తి ధృవీకరణ పత్రాలను అందజేశారు. తొలి పత్రాన్ని అందుకున్న సంతబొమ్మాలి మండలం దండు గోపాలపురానికి చెందిన మల్లా భారతమ్మ మాట్లాడుతూ మా జిరాయితీ భూమి ఎన్నో ఏళ్లుగా 22ఏలో చిక్కుకుపోయింది. దీని కోసం ఎంతో కాలంగా పోరాడుతున్నాం. నేడు మాతో పాటు మా సర్వే నంబర్‌లోని 19 మందికి విముక్తి లభించింది.

ప్రభుత్వానికి, మంత్రికి, కలెక్టర్‌కు కృతజ్ఞతలు అని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే సోంపేట మండలానికి చెందిన సనపల వాసుదేవరావు, మందసకు చెందిన జుత్తు తారకేశ్వరరావు, ఎచ్చెర్ల మండలానికి చెందిన కొనతల అప్పారావు తదితరులకు వేదికపై ధృవపత్రాలను అందజేశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో జిరాయితీ భూములను కూడా రీ-సర్వే పేరుతో 22ఏలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు తమ అవసరాలకు భూమి అమ్ముకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. ప్రతి ఫిర్యాదును 'ఈ-ఆఫీస్' ద్వారా నమోదు చేసి, ఇక్కడే ఉన్న అన్ని స్థాయిల అధికారులు తక్షణమే పరిష్కరిస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, , జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్మణ మూర్తి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లావణ్య, పద్మావతి ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణ మూర్తి, వెంకటేష్, అన్ని మండల తహసిల్దార్లు, సర్వేయర్లు, ఎండోమెంట్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, అటవీ శాఖాధికారులు, విఆర్ఓలు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# పేదలకు వరం సీఎం సహాయ నిధి

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**నవతరం - శ్రీకాకుళం**

ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం.. నిరుపేదలకు వరంలా మారిందని.. దరఖాస్తు చెయ్యడమే ఆలస్యం భరోసా లభిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శుక్రవారం నాడు శ్రీకాకుళం నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందించారు. హిరమండలం మండలం గులుమూరు గ్రామానికి చెందిన సిగడాన ఆనందరావు తీవ్ర అనారోగ్యం పాలై కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. ఆ శోకానికి తోడు ఆసుపత్రి ఖర్చులు ఆర్థిక ఇబ్బందులు తెచ్చి పెట్టాయి. ఈ సందర్భంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును ఆనందరావు భార్య సంప్రదించారు.


పరిస్థితులు వివరించడంతో సీఎం సహాయనిధికి కేంద్ర మంత్రి కార్యాలయం నుండి సిఫార్సు అందించారు. దీంతో ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం మంజూరు అయిన 2,26,028/- రూపాయల చెక్కును బాధితురాలు అనసూయకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అందించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం పూర్తి తోడ్పాటు అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# వేణుగోపాలస్వామి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

**నవతరం - గార**

శాలిహుండం కొండపై వెలసిన శ్రీ కాళీయ మర్ధన వేణుగోపాలస్వామి దేవాలయ నూతన పాలకమండలి సభ్యులు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రభుత్వం కమిటీని నియమించగా, ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ఈ కమిటీ ఒక వారధిలా పనిచేయాలని ఆకాంక్షించారు. గతంలో ధర్మకర్తగా సుగ్గు మధురెడ్డి చేసిన సేవలను కొనియాడుతూనే, కొత్తగా బాధ్యతలు చేపట్టిన సభ్యులు ఆలయ సంప్రదాయాలను పాటిస్తూ క్షేత్రాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని సూచించారు.

దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేసిన




సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందించారు. ఆలయానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ముఖ్యంగా జాతర సమయాల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను, కమిటీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, ధర్మకర్త మధురెడ్డి, స్థానిక కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, మండల స్థాయి అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు శాస్త్రీయ చర్యలు పట్టాలి

- గత రెండేళ్లతో పోలిస్తే తగ్గిన మరణాలు.. పెరిగిన గాయాలపై ఎస్పీ ఆందోళన
- బ్లాక్ స్పాట్స్ వద్ద నిఘా పెంచాలని అధికారులకు ఆదేశం

**నవతరం - శ్రీకాకుళం**

శ్రీకాకుళం, డిసెంబరు 26:జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు శాస్త్రీయ దృక్పథంతో అడుగులు వేయాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రహదారి భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 'బ్లాక్ స్పాట్స్' వద్ద రక్షణ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల సరళిని గణాంకాలతో వివరిస్తూ, గత రెండేళ్లతో పోలిస్తే 2025లో ప్రమాదాల సంఖ్య మరియు ప్రాణనష్టం కొంత మేర




తగ్గుముఖం పట్టడం సానుకూల పరిణామమని ఎస్పీ పేర్కొన్నారు. 2023లో 810గా ఉన్న ప్రమాదాలు, 2024లో 889కి పెరిగినప్పటికీ, ప్రస్తుత 2025 ఏడాదిలో డిసెంబర్ 25 నాటికి ఆ సంఖ్య 699కి తగ్గింది. ముఖ్యంగా ఘోర ప్రమాదాల సంఖ్య గత -మిగతా 2లో

# జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దుదాం

- ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి
- 115 హాట్-స్పాట్లలో నిఘా నీడ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆదేశం
- మెడికల్ షాపులపై డ్రగ్ కంట్రోల్ నిఘా.. నిబంధనలు మీరితే లైసెన్సులు రద్దు




**నవతరం - శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లాలో మాదకద్రవ్యాల మహమ్మారిని రూపుమాపి, యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కేవీ మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్' (ఎన్కార్డ్) సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..

-మిగతా 2లో

ఎడిటోరియల్

# 'టెట్' టెన్షన్

పరీక్షలంటే సహజంగా విద్యార్థులకు టెన్షన్ ఉంటుంది. కానీ, ఇప్పుడు ఆ భయం ఉపాధ్యాయులనూ పట్టుకుంది. భారత అత్యున్నత న్యాయస్థానం ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేస్తూ ఈ ఏడాది సెప్టెంబర్ ఒకటిన తీర్పు వెలువరించింది. ఈ తీర్పు ప్రకారం వీరంతా రెండేండ్లలోపు టెట్‌రాసి ఉత్తీర్ణులవ్వాలి. లేదంటే ఉద్యోగాలకే ఎసరొచ్చే ప్రమాదం ఉంది. ఇక్కడ తీర్పును తప్పు పట్టడం ఎవరి ఉద్దేశం కాదు, కానీ, దీనిపై రివ్యూ పిటిషన్ వేయాల్సిన బాధ్యత కేంద్రానిది. ఎందుకంటే దీన్ని అమలు చేయకూడదని ఇప్పటికే ఐదు రాష్ట్రాలు సహా ఉపాధ్యాయ వర్గాలు, సంఘాలు సుప్రీంలో ముప్పయి వరకు పిటిషన్లు దాఖలు చేశాయి. సమస్యను పరిష్కరించాల్సిన ఎన్‌సీటీఈ, కేంద్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికీ నాలుగు నెలలు అవుతున్నా ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఇది న్యాయపరమైన తీర్పు అనడం కంటే, ఒక విధాన వైఫల్యానికి వచ్చిన తుదిముద్రలా మారింది. ఏ రకంగా చూసినా విద్యారంగం మీద ప్రభావం చూపే నిర్ణయమిది!

విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి టెట్ తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టు 23న నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్స్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) ఉత్తర్వులు జారీ చేసింది. దీని తర్వాత టెట్ అర్హత సాధించిన వారే డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఐదేండ్లలోపు సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు మినహా రాష్ట్రంలో వివిధ క్యాడర్లలో ఉన్న మిగతావారు టెట్ రాయాల్సి ఉంటుంది. మినహాయింపువారు కూడా పదోన్నతులు పొందాలంటే టెట్ తప్పనిసరి. 2010కంటే ముందు కేవలం డీఎస్సీ పరీక్షను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ఇందులో ప్రతిభ కనబరచిన వారికి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక చేసింది. సుప్రీంతీర్పు నేపథ్యంలో 2027 ఆగస్టు 31వ తేదీలోపు వీరంతా టెట్ ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. దేశంలో ఇరవై ఐదు లక్షల వరకు ఉంటే, రాష్ట్ర వ్యాప్తంగా ఈ సంఖ్య 45,742లుగా ఉన్నది. వీరందరిపై టెట్ ప్రభావం చూపుతుంది. ఉపాధ్యాయుల ఆమోదయోగ్యం లేని ఇలాంటి సంస్కరణలు విద్యారంగాన్ని గందరగోళ పరచడమే కాదు, సంక్షోభంలోకి నెడతాయి. ఉద్యోగంలో చేరినప్పుడు లేని నిబంధన సర్వీసులోకి వచ్చాక తీసుకురావడం సహేతుకం కాదు. పదేండ్లు, పదిహేనేండ్లు పనిచేసిన తర్వాత ఉద్యోగ భద్రతకు ముడిపెట్టి అమలు చేస్తామనడం నిజంగా అన్యాయం. ఉపాధ్యాయుడు పిల్లలకు పాఠాలు చెప్పాలి. పరీక్షలు నిర్వహించాలి, మూల్యాంకనాలు చేయాలి. ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలి. వీటన్నింటితో పాటు టెట్ కోసం ప్రత్యేకంగా చదవాలి. ఇప్పటికే ఒత్తిడికి గరవుతున్న వారిని ఇది మానసికంగా మరింత కుంగదీస్తుంది. పైగా ప్రభుత్వపాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, టెట్ అర్హత కోసం పరీక్ష రాసే నిరుద్యోగులకు ఒకే విధమైన సిలబస్ ఉండనుంది. విద్యాబోధనకు సంబంధించి ఇప్పటికే పలుమార్లు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మళ్లీ మొదటికే రావాలి. టీచర్లుగా పనిచేస్తున్న వారికి కేవలం వారు బోధించే సబ్జెక్టులపై పట్టు ఉంటుంది. కొత్త సిలబస్‌తో టెట్ అర్హత సాధించడమంటే కష్టతరం కాదా? అందుకే పాతికేళ్లకు పైగా ఉద్యోగం చేస్తున్న ఉపాధ్యాయులు 'మేం ఇప్పుడు పరీక్షలు ఎదుర్కొవాలా?' అని ప్రశ్నించడం కూడా సబబే అనిపిస్తుంది. అనారోగ్య సమస్యలతో బాధపడేవారు, వయసు మీదపడిన వారు కంప్యూటర్ ముందు కూర్చొని ఆన్‌లైన్‌లో పరీక్ష రాయడం సాధ్యమయ్యే పనేనా? ఇంతమాత్రం కూడా కేంద్రం ఆలోచించకపోవడం శోచనీయం. రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. కానీ, టెట్ నోటిఫికేషన్ వేసి దరఖాస్తులు కోరడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన పెరిగింది. కొత్తగా పోటీపడే అభ్యర్థులకు టెట్ అవసరమే. కానీ, ఉపాధ్యాయుల్లో నెలకొన్న భయాందోళనల్ని దూరం చేయాలంటే కేంద్రం చొరవ చూపాలి. తక్షణమే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి. విద్యాహక్కు చట్టం అమలుకు పూర్వం నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి కాకుండా సవరణ ఉత్తర్వులు పొందాలి. ఉపాధ్యాయ అర్హత పరీక్షను ప్రాస్పెక్టివ్‌గా అమలు చేసే విధంగా పార్లమెంటులో విద్యాహక్కుచట్టం సెక్షన్ 23ను సవరించాలి. టెట్ సిలబస్‌ను, అర్హత మార్కులను సవరించి టెట్‌ను ఈ రెండేండ్లలో వీలైనన్ని ఎక్కువసార్లు నిర్వహించాలి. లేదా ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలి. ఒక ఉపాధ్యాయునికి బోధనా అనుభవం కన్నా గొప్ప అర్హతేమీ ఉండదు. దాన్ని టెట్ ద్వారా కొలవాలనుకోవడం సరికాదు. సుప్రీం తీర్పును గౌరవించడం సర్కారు బాధ్యత. అలాగే ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడటం కూడా సర్కారుదే బాధ్యత. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించే విధానాల్ని అనుసరించాలి. లేదంటే టెట్ టెన్షన్ తగ్గదు.

# జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దుదాం

మొదటిపేజీ తరువాయి

జిల్లా వ్యాప్తంగా 115 గంజాయి హాట్-స్పాట్లను గుర్తించామని, ఈ ప్రాంతాల్లో వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నాగావళి తీర ప్రాంతాల్లో నిఘా కోసం ప్రత్యేకంగా కెమెరాలు అమర్చుతున్నామని, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తూ డ్రోన్లు, స్నిపర్ డాగ్స్ సాయంతో మారుమూల ప్రాంతాలను జల్లెడ పడుతున్నామని వెల్లడించారు. మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపేందుకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్'ద్వారా అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ వివరించారు. ప్రతి మండలం నుంచి ఎంపిక చేసిన 31 మంది మాస్టర్ ట్రైనర్లు యువతను చైతన్యపరుస్తారని, కాలేజీల్లో 'ఈగిల్ క్లబ్'ల ద్వారా ప్రతి శనివారం సదస్సులు నిర్వహించాలని సూచించారు. మెడికల్ షాపుల్లో నిద్రమాత్రలు, మత్తు కలిగించే మందులను ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఆసుపత్రిలో డీ-అడిక్షన్ సెంటర్‌ను బలోపేతం చేస్తున్నామని, నవంబర్ నెలలో జిల్లాలో 175 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 14 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. గంజాయి విక్రేతలపైనే కాకుండా, పాత నేరస్తులపై కూడా నిరంతరం నిఘా ఉంచి వారం వారం వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎస్పీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర రెవెన్యూ ఇంటిలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ పూజా రాణి పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి కట్టడికి తీసుకుంటున్న చర్యలపై నివేదికలు పరిశీలించారు. నేరగాళ్లు నూతన పంథాలో గంజాయి రవాణా చేస్తున్నారని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అరుదైన జంతువుల, వాటి చర్మం లేదా గోళ్ళు, కొమ్ముల అక్రమ రవాణా సమాచారాన్ని చేరవేయాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణ మూర్తి, జిల్లా రవాణా అధికారి విజయ సారథి పాల్గొన్నారు. వీరితో పాటు ఎక్సైజ్, ఆర్ అండ్ బీ, ఆర్టీసీ, డ్రగ్ కంట్రోల్ అథారిటీ, మున్సిపల్, పంచాయతీ రాజ్ తదితరు శాఖల అధికారులు హాజరయ్యారు.

# కంప్యూటర్ ఇంటర్నల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

- ప్రపంచమే కంప్యూటర్ యుగమైంది
- కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.శివ శంకర్




**నవతరం - శ్రీకాకుళం**

నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో చార్లెస్ బాబేజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ చార్లెస్ బాబేజ్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించి అనంతరం జనవరి 10 వ తేదీన బిసిఏ విభాగ ఆధ్వర్యంలో జరిగే ఆక్సీ 2కె26 ఇంటర్నల్ ఫెస్ట్ కు సంబందించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. వీరిరువురు మాట్లాడుతూ ప్రపంచమే కంప్యూటర్ యుగమైందని, ప్రస్తుత ప్రపంచం అంతా కంప్యూటర్ సైన్స్ మీద ఆధారపడి ఉందని, ఫెస్టులో భాగముగా వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులందరూ వాటిలో పాల్గొనాలని సూచిశీచారు. అనంతరం కోడింగ్ లో గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె వేణు కంప్యూటర్ విభాగాధిపతి ప్రసాద రావు, కంప్యూటర్ విభాగ అధ్యాపకులు, బిసిఏ విద్యార్థినిలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు శాస్త్రీయ చర్యలు పట్టాలి

మొదటిపేజీ తరువాయి

రెండేళ్లలో 281 మరియు 279 ఉండగా, ఈ ఏడాది ఇప్పటివరకు 245కి తగ్గడం కొంత ఊరటనిచ్చే అంశమని ఆయన వివరించారు. అయితే, ప్రమాదాల్లో గాయపడుతున్న వారి సంఖ్య పెరుగుతుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం మరియు హెల్మెట్ ధరించకపోవడం వల్లనే అత్యధిక ప్రాణనష్టం జరుగుతోందని ఎస్పీ అభిప్రాయపడ్డారు. 2024 నవంబర్ మరియు 2025 మార్చి, మే నెలల్లో ప్రాణనష్టం ఎక్కువగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఆయా సమయాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదకరమైన మలుపుల వద్ద ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే అధికారులు తక్షణమే హెచ్చరిక బోర్డులు, బ్లింకర్లు ఏర్పాటు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని రవాణా, పోలీస్ శాఖాధికారులకు దిశానిర్దేశం చేశారు. నవభారత జంక్షన్ వద్ద రోడ్డు విస్తరణకు ప్రణాళిక సిద్ధంగా చేయాలని ఆదేశించారు. భైరవానిపేట జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లు వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఆర్టీసీ బస్సులు రోడ్లపై ఎక్కడపడితే అక్కడ ప్రమాదకరంగా ఆపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వచ్చే జనవరి మాసాన్ని రహదారి భద్రత మాసంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్నామని ఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్వీ లక్ష్మణ మూర్తి, జిల్లా రవాణా అధికారి విజయ సారథి, ఆర్ అండ్ బి ఎస్ఈ సత్యనారాయణ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం అతిథి ఉపన్యాసం

# క్వాంటం యుగానికి పరిచయం

**నవతరం శ్రీకాకుళం**

ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), శ్రీకాకుళంలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఇన్వైటెడ్ టాక్ (అతిథి ఉపన్యాసం)" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్యచంద్రరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (ఎజఖ) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై. రామచంద్రరావు హాజరై, "క్వాంటం రివల్యూషన్ ఫ్రం ఫిజిక్స్ టు టెక్నాలజీ" అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కలిగించేలా ప్రసంగించారు.

క్వాంటం భౌతిక శాస్త్రం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో పోషిస్తున్న కీలక పాత్రను, భవిష్యత్తులో పరిశోధనలకు ఉన్న విస్తృత అవకాశాలను ఆయన సులభమైన ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ డి.బి.ఆర్.కె. మూర్తి, డాక్టర్ ఎస్. పద్మావతి, డాక్టర్ ఏ. మోహన రాజు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే కళాశాల విద్యార్థినులు, ఇతర విభాగాల అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ తరహా శాస్త్రీయ ఉపన్యాసాలు విద్యార్థినుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు, ఆధునిక విజ్ఞాన సాంకేతికతలపై అవగాహన కలిగిస్తాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది.





# మానవత్వం చాటుకున్న జూహిత్ నందన్ క్రిష్ణ ట్రస్ట్

- చిన్నారి వైద్యానికి రూ. 45 వేలు ఆర్థికసాయం



**నవతరం -ఎచ్చెర్ల**

ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామంలోని బీసీకాలనీలో కూలి పని చేసు కుంటూ జీవనం కొనసాగిస్తున్న సింధు రామారావు కుమారుడు సింధు నందన్ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రాణంకోసం పోరాడుతున్న విషయం విదితమే. స్పందించిన జూహిత్ నందన్ క్రిష్ణ ట్రస్ట్ అధ్యక్షులు ఉర్లాన. గోపాల క్రిష్ణ, ట్రస్ట్ కన్వీనర్ బగాది. ప్రవీణ్ కుమార్, ట్రస్ట్ కోశాధికారి జి.వి.వి.బి శంకర శాస్త్రి, వారి మిత్రులు, దాతలు అందించిన సహకారంతో, నందన్ వైద్యానికి రూ. 45 వేలు ఆర్థికసాయాన్ని శుక్రవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సేవకులు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, జేసీఐ ఉపాధ్యక్షులు ఉర్లాం శివతేజ ద్వారా పూర్తి వివరాలు సేకరించి ఈ రోజు చిరు సహాయాన్నందించామని తెలిపారు. ఆర్థికంగా ఈ కుటుంబం చితికిపోయిందని, శస్త్ర చికిత్సకు సిద్ధమయ్యారని, సుమారు చికిత్సకు 25 లక్షల వరకు అవసరముందని, ఇప్పటి వరకు అనేక రూపాలలో కొంత నగదు వచ్చిందని, మనసున్న దాతలు బొట్ట.రమేష్ (75698 22086), కర్రి గోవింద (90006 01005) కు గాని, ఫోన్ పే ద్వారా సహాయమందించాలన్నారు. అనంతరం స్పందించిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూహిత్ నందన్ క్రిష్ణ ట్రస్ట్ సభ్యులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే కూన రవికుమార్

**నవతరం-ఆమదాలవలస**

ఆమదాలవలస నియోజకవర్గంలో ఆముదాలవలస పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఆముదాలవలస గౌరవ శాసనసభ్యులు మరియు రాష్ట్ర పియుసి చైర్మన్ శ్రీ కూన రవికుమార్ గారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బూర్జ ,సరుబుజ్జిలి, ఆముదాలవలస మండలాలకు చెందిన అంగనవాడి కార్యకర్తలకు 5జి మొబైల్స్ ను పంపిణీ చేయడం జరిగింది. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.



# సృష్టి రహస్యం దాగి ఉన్న అయ్యప్ప స్వామి చరిత



శ్రీ అయ్యప్పస్వామి వారి అవతారంలో సృష్టిరహస్యం దాగి వుంది. అత్రి మహర్షి, అనసూయ దంపతుల కుమారుడు దత్తాత్రేయుడు. లక్ష్మీ, సరస్వతి, పార్వతుల అంశతో జన్మించిన స్త్రీలీలావతి. దత్తాత్రేయుడు, లీలావతిల వివాహం జరిగింది. కొంతకాలం దాంపత్య జీవనం గడిపారు. అవతార పరమార్థం నెరవేరాక దత్తాత్రే యావతారం ముగించాలన్నాడు దత్తుడు. ఇహలోకపు సౌఖ్యాలు కావాలంది లీలావతి. దీనితో కోపోద్రిక్తుడైన దత్తాత్రేయుడు ఆమెను మహిషిగా జన్మించమని శపిస్తే ఆమె కూడా అలానే ప్రతిశాప మిచ్చింది లీలావతి. లీలావతి మనిషిగా జన్మించింది. మహిషి ఆగడాలకు అంతే లేకుండా పోయింది. అంతేకాకుండా బ్రహ్మదేవుడి కోసం 'మహిషి' ఘోర తపస్సు చేసింది. తపస్సుకు మెచ్చిన బ్రహ్మ దేవుడు ప్రత్యక్షమైతే విష్ణువుకు శివునికి పుట్టే బిడ్డ ద్వారా మాత్రమే తనకు మరణం సంభవించేలా వరం ఇవ్వమని కోరింది. బ్రహ్మవరం ప్రసాదించాడు. వరగర్వంతో మహిషి ఆగడాలకు అంతే లేకుండా పోయింది. మహిషి ధాటికి దేవలోకంగడగడలాడసాగింది. దేవతలందరూ ఆలోచించసాగారు. చివరకు దత్తాత్రేయుడిని అందమైన మహిషంగా మార్చారు. ఆ మహిషం మహిషి కంటపడింది. ఆకర్షితురాలైన మహిషిలో మదనతాపం మొదలైంది. దీనితో మహిషి మహిశం పన్నెండు సంవత్సరాలపాటు పంపా తీరంలో కామకేళి కార్యంలో ఉండగా ఒక బాలుడు ఉద్భవించాడు. ఆ బాలుడే అయ్యప్ప. ఆ సమయంలో బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై 'హరిహర సుతుడు' అని నామకరణం చేశాడు. మోహినీ రూపం చాలించిన శ్రీమహా విష్ణువు ఆ బాలుడి మెడలో ఒక మణిహారాన్ని వేశాడు. అందుకే ఆ బాలునికి 'మణికంఠుడు' అనే పేరు కూడ ఏర్పడింది. కేరళలోని పందళ రాజ్యాన్ని పరిపాలిస్తూ వుండే రాజు రాజశేఖర పాండ్యునికి సంతానం లేదు. ఒకరోజు వేటకు అడవికి వెళ్ళాడు. అక్కడ రాజుకు మెడలో మెరుస్తూ వున్న మణిని ధరించిన బాలుడైన మణికంఠుడు కనిపించాడు. "ఈ బాలుడిని పుత్రుడుగా స్వీకరించు. ఆ బాలుడివల్ల నీ వంశం వర్ధిల్లుతుంది" అనే మాటలు వినిపించాయి. దీనితో రాజు బాలుడిని రాజ్యానికి తీసుకునిపోయి కొడుకుగా స్వీకరించి అల్లారు ముద్దుగా చూసుకో సాగారు. కొన్ని రోజులకు రాజశేఖరుడికి ఒక కుమారుడు జన్మించాడు. ఆ పిల్లవాడిని 'రాజరాజన్.' అని పేరు పెట్టారు. మణికంఠుడికి పన్నెండేళ్ళ వయస్సు రాగానే అతనికి యువరాజుగా పట్టాభి షేకం జరపాలని నిర్ణయించారు. స్వంత కుమారుడు రాజు కావా లని కాంక్షించిన రాణి మంత్రితో కలసి మణికంఠుడిని అంతమొం దించేందుకు ఎన్నో ఎత్తులు వేసింది. అన్నీ విఫలం కావడంతో రాణి దొంగ తలనొప్పి నటించింది. పులి పాలు తెస్తేగానీ తలనొప్పి తగ్గదని రాణి రాజవైద్యుడి చేత పలికింపజేసింది. చివరకు మణికంఠుడు అందుకు సిద్ధమ య్యాడు. తలపై పూజా ద్రవ్యాలని ఒక ముడిలోనూ, ఆహారపదార్థా లను మరొక ముడిలోనూ కట్టుకుని, ఆ మూటను తలపై పెట్టు కుని పులిపాల కోసం అడవికి బయలు దేరాడు.

ఈలోగా మహిషం మాయలో పడిన మహిషి కళ్ళు తెరిచి దేవతలపై కోపించి మళ్ళీ విజృంభించసాగింది. అడవికి వెళ్తూ వున్న మణికంఠుడు మహిషిపై దాడి చేసి దాని పీక నులిమి వదిలేశాడు. ఆ మహిషి 'అళదామేడు' పర్వతంగా మారి క్షణక్షణా నికి పెరగసాగింది. దానిపై పెద్దబండ వేసి నాట్యం చేసి మహిషిని పూర్తిగా అంతమొందింపజేసి సకల లోక వాసులను రక్షించాడు. ఈ సమయంలో దేవతలందరూ పులి రూపాలను ధరించి ప్రత్యక్షం కాగా, ఇంద్రుడు పెద్ద పులిగా మారగా ఆ పులిమీదే సవారి చేస్తూ మణికంఠుడు పందళరాజ్యానికి చేరాడు. దీనితో అందరూ మణికంఠుడిని దైవాంశ సంభూతుడిగా గుర్తించి ప్రార్థించారు. శ్రీ అయ్యప్పస్వామి పూజాపద్ధతి ప్రత్యేక ప్రతిపత్తి కలిగిన వైష్ణవ శైవమత అద్భుత సమ్మేళనము, హరిహరుల కుమారునిగా శ్రీ అయ్యప్పస్వామి వైష్ణవ శైవ భక్తులకాశ్రయ మిచ్చుదేవరయని వారి నమ్మకము చూరగొన్న పరమ పవిత్రమూర్తి,

అతిలోక సౌందర్యవాహిని, మోహిని రూప శ్రీహరి పరమశివుని కలయికతో శ్రీ అయ్యప్పస్వామి జననము సర్వలోక పూజ్యమైనది.

పవిత్ర పంపానదీ తీరాన బాలునిగానున్న శ్రీ అయ్యప్పను అనపత్యు డైన పాతాళరాజు చూచి ఇంటికి తెచ్చుకొని పెంచుకొనెను. అమూల్య మణి కంఠాభరణముగాగల ఈ బాలుడు మణి కంఠనామముతో ప్రసిద్ధుడాయెను. కాలక్రమమున, రాణి ప్రసవించి కుమారుని కనెను. ఇద్దరు దినదిన ప్రవర్ధమానముగా పెరుగుతుండిరి. తదుపరి కొంత కాలమునకు ఈ ఇద్దరిలో రాజ్యాధికారమునకు వారసుని ఎంపికలో సందిగ్ధము సంభవించెను. రాణి తన కుమారునికే రాజ్యమప్పగింట ఉత్తరాధికారిని జేయ సంకలెత్పంచెను. తన దుష్ట మంత్రాంగముతో మణికంఠుని అనేక కష్టముల పాలైసెను. రోగ గ్రస్తురాలివలె నటించుచు, ఔషధముగా మణికంఠుని, పులిపాలు తెమ్మని కోరెను. దేవతల యభీష్టము మేరకు సంకట కారకుడైన మహిషాసురుని సంహరించుటకు మణికంఠుని ఆయత్తపరచుటకు ఈ పరీక్ష జరి గెను. మహిషాసురుని సంహరించి పులువాహనునిగా మణికంఠుడు గృహమున కరుదెంచి అందరిని సంభ్రమాశ్చర్యముల దేలియాడ జేసెను.

మహిమాన్వితుడైన మణికంఠుడే రాజ్యార్హుడని నిర్ణయించి రాజ్యము, మణికంఠుని కప్పచెప్ప నిర్ణయించిరి. కాని మణికంఠు దందులకంగీకరింపక తన శేషజీవితమును తపస్సులో గడుపుటకు నిశ్చయించుకొనెను. పాతాళ రాజు, అద్భుత దేవాలయమును శబరి కొండల నడుమ నిర్మించి యిచ్చెను. అదియే నేడు శబరిమలయందు వెలసిన శ్రీ అయ్యప్పస్వామి దేవాలయముగ, ప్రసిద్ధిగాంచినది.

నేడు భక్తులు, సాంప్రదాయముగ నున్న 'ఎరుమెలి' దారిగుండా శబరిమలకు ప్రయాణము చేయుచున్నారు. స్వామిని చేరుటకు కొండ దారి నిటారుగా నుండి జారుడు స్వభావము కలిగి బహు కష్టసాధ్య మగుచున్నది. అయినను భక్తజనసందోహము, మహెరీత్సా హముతో, శ్రీ అయ్యప్పదేవాలయము చుట్టూ దట్టమైన అడవి, క్రూర జంతు సందోహమున్నను లెక్కచేయక. ప్రతి సంవత్సరము మిక్కుట ముగా స్వామి దర్శనమునకై వచ్చుచున్నారు. ప్రతియేట, డిసెంబరు మాసమున జరుగు మండలపూజ, మకర విలక్కు విశు, చైత్ర ప్రథమ దినమునందు భక్తులు స్వామిని దర్శించు టకు అధిక సంఖ్యలో వచ్చుచున్నారు: మకరజ్యోతి దర్శించుట మహద్భాగ్యముగ భక్తులు పరిగణించుచున్నారు. శబరిమల యాత్రచేయు భక్తులు నవంబరు నెలలో నలభై ఒక రోజులు వ్రత దీక్షతో తులసిమాల (శబరిమల దర్శించిన స్వామి ఆశీర్చనములతో) ధరించి కటికనేలపై పరుండుట, మాంసాహార విసర్జన మొదులాగల నియమాలతో కఠోరవ్రతదీక్ష, భక్తులను స్వాము లుగా తీర్చిదిద్ది మానసిక, శారీరకంగా శబరియాత్ర చేయుటకు సమాయత్తము చేయును. స్వామి కైంకర్య నిమిత్తము సంబారములనీ భక్తులే స్వయముగ శిరమునందుంచొని (ఇరుముడు) యాత్రచేయుట విధిగా నిర్ణయించ బడినది. పదునెనిమిది మెట్లపైసాగి స్వామి దర్శనము చేయుటకై శబరి మల యాత్రచేయు భక్తులు, వీర, పద్మాశన, చిన్ముద్రమూర్తి అయిన శ్రీఅయ్యప్ప స్వామిని సేవించి, నిజజీవితములో అట్టి దీక్షను సాగిం చుచు కడు ధన్యులగుచున్నారు. వారు స్వాముల వలె కడు పూజనీ యులగుచున్నరు. ఈ స్వామికి మన ఆంధ్ర దేశమున కూడా ఎన్నో ఆలయములు కలవు.

అయ్యప్ప భక్తులు పాటించవలసిన నియమాల తోరణం:

ఫ్యాషన్ కోసమని కాకుండా భక్తితో దీక్షను స్వీకరించాలి.

దీక్ష పూర్తయిన తర్వాత కూడా జీవితంలో 'మాటతో, ప్రవర్తనతో, ఆలోచనలతో, చూపుతో,తెలిసో ,తెలియకో ఎవరికీ హాని చేయరాదు. అనవసర మాటలకు, తగాదాలకు స్వస్తి పలకాలి. దీక్ష రోజుల్లో చన్నీటి స్నానాన్ని ఆచరించాలి. సూర్యాస్తమయానికి ముందే ఇంట్లో సన్నిధానంలో దీపం వెలిగించాలి. పూజాధికాలు పూర్తి చేసు కోవాలి. సాత్వికాహారం తీసుకోవాలి నేలపైనే (చాప వేసుకోవచ్చు) పడు కోవాలి. బ్రహ్మచర్యం పాటించాలి. అబద్ధాలాడరాదు. సౌందర్య సాధనాలు వాడరాదు (సబ్బు, షాంపు, తలనూనె వంటివి), క్షవరం చేయించకూడదు. గడ్డం, గోళ్లు తీయరాదు. మృతదేహాల్ని, జంతు కళేబరాలను చూసినప్పుడు స్నానం చేసి స్వామిని స్మరించుకొనిగానీ మంచినీళ్లు తాగకూడదు. భిక్షకు ముందు విస్తరి ఎంత శుభ్రంగా ఉంటుందో... తీసేప్పుడూ అలాగే ఉండాలి. మూడు, నాలుగేళ్లు మాల ధరిస్తే గురుస్వాములు అవుతామనే భావన చాలా మందిలో ఉంటుంది. కనీసం ఎనిమిది సార్లు పద్దెనిమిది మెట్లు ఎక్కి, స్వామివారిని దర్శించుకున్నవారు. అందులో తమ గురువు ఆజ్ఞతోనే గురుస్వాములు అవుతారు.

ఏ గుడిలో అయితే మాలధారణ జరుగుతుందో.. దీక్షాకాలం పూర్తైన తర్వాత అదే గుడిలో మాల విసర్జన చేయాలి.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# గోల్ పడలేదు

**మూవీ రివ్యూ: ఛాంపియన్**
**రేటింగ్: 2/5**
**తారాగణం: రోషన్ మేకా, అనస్వర రాజన్, ప్రకాష్ రాజ్, కెకె మీనన్, మురళీధర్ గౌడ్, రచ్చ రవి, నందమూరి కళ్యాణ చక్రవర్తి, వెన్నెల కిషోర్, కోవై సరళ, అవంతిక, దుల్కర్ తదితరులు**
**సంగీతం: మిక్కీ జె మేయర్**
**కెమెరా: మదీ**
**ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరరావు**
**నిర్మాతలు: ప్రియాంకా దత్, జికె మోహన్, జెమిని కిరణ్**
**దర్శకత్వం: ప్రదీప్ అద్వైతం**
**విడుదల: 25 డిసెంబర్ 2025**




"పెళ్లిసందడి" తర్వాత ఏకంగా నాలుగేళ్లకి రోషన్ ఈ సినిమాతో ముందుకొచ్చాడు. "గిర గిర.." పాట సూపర్ హిట్ అవడం ఈ చిత్రానికి కలిసొచ్చిన అతి పెద్ద ప్రచారం. ట్రైలర్ చూస్తే పీరియడ్ బ్యాక్ డ్రాప్ అని, తెలంగాణా సాయుధ పోరాటం నాటి కథ అని తెలుస్తూనే ఉంది.

కథలోకి వెళ్లితే భైరాన్ పల్లి అనే ఒక ఊరు నిజాం పాలనను వ్యతిరేకిస్తూ ఉంటుంది. ఆ ఊరి పెద్ద రాజిరెడ్డి (కళ్యాణ చక్రవర్తి). అయితే ఆ ఊరిని ఎలాగైనా తమ కాళ్లకిందకి తెచ్చుకోవాలని రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ (కెకె మీనన్) పట్టుదలగా ఉంటాడు. ఇదిలా ఉంటే మైకేల్ విలియంస్ (రోషన్) ఒక ఫుట్ బాల్ ఆటగాడు. తన ఆటను మెచ్చి ఒక క్లబ్ అధినేత లండన్ కు వచ్చి తమ టీములో చేరమంటాడు. అది ఎలాగూ మైకేల్ చిరకాల వాంఛ. అయితే అతనికొక అవాంతరం ఎదురవుతుంది. దానిని దాటి లండన్ విమానం ఎక్కడానికి ఒక గన్ డీలర్ తో డీల్ కుదుర్చుకుంటాడు. కొన్ని తుపాకుల్ని పోలీసుల కళ్లుగప్పి ఒక చోటుకి చేర్చడం ఆ డీల్. ఆ క్రమంలో దారి తప్పి భైరాన్ పల్లి చేరతాడు మైకేల్. అక్కడ చంద్రకళ (అనస్వర) అనే అమ్మాయి ప్రేమలో పడతాడు. ఆ తర్వాత ఏమౌతుంది? రజాకార్ల నుంచి ఆ ఊరు ఏ విధంగా రక్షింపబడుతుంది. మైకేల్ లండన్ వెళ్తాడా? ఈ ప్రశ్నలకి సమాధానం ఈ చిత్రం. తెలంగాణా సాయుధ పోరాటం మీద ఆ మధ్యన "రజాకర్" పేరుతో ఒక సినిమా వచ్చింది. జనాదరణ లభించలేదు. ఎందుకో గానీ స్వాతంత్ర్య పోరాటాల కథల్ని తెరకెక్కించడంలో మూస పద్ధతి వల్ల ఫెయిల్ అవుతున్నాయని అనిపిస్తుంది.

ఈ చిర విషయానికొస్తే.. ఒక గ్రామం, నిజాం పాలనపై తిరుగుబాటు..ఆ గ్రామంలో కమ్మరి, కుమ్మరి, బ్రాహ్మణ, రెడ్డి%ా%ఇలా అందరూ పోరాటయోధులే.. వాళ్ల ఐకమత్యం, అన్యోన్యత చూస్తే వీళ్లంతా పోరాటంలో పోతారని ఈ తరహా సినిమాలు అనేకం చూసేసిన ప్రేక్షకులకి తెలుస్తూనే ఉంటుంది. అందుకే, ప్రెడిక్టబిలిటీ మూలాన వాళ్లు పోతున్నా ఎటువంటి ఫీలింగూ రాదు. దానికి తోడు సుదీర్ఘమైన పోరాట సన్నివేశాలు. మధ్యలో హీరో హీరోయిన్ల ఎమోషనల్ రొమాన్స్! వెరసి సహనానికి పరీక్ష పెట్టినట్టయ్యింది. తెలిసిన నటీనటులు చాలామంది ఉండడం వల్ల నిర్మాణ విలువలు తెర మీద కనిపిస్తాయి. మిక్కీ జె మేయెర్ సంగీతం పాటల్ని చక్కగా నిలబెట్టింది. ఇంత స్పష్టంగా సాహిత్యం వింపడి చాలా నాళ్లయ్యింది. హీరోయిన్ అందంగా ఉంది. అయినా ఏం లాభం? కథ, కథాగమనాల్లో కొత్తదనం, ఉత్కంఠ లేకపోవడం వలన తీరం దాటని తుఫానులో ఇరుక్కున్నట్టయ్యింది ప్రేక్షకుల పరిస్థితి. పైగా క్లైమాక్స్ కి వచ్చేసరికి ఎంతో కొంత పోయెటిక్ జస్టిస్ జరగాలి. ప్రతిఘటించిన ఊరి జనం సాధించింది ఏముంది అనే ప్రశ్న సగటు ప్రేక్షకుడికి వస్తుంది. వాళ్ల త్యాగం భారతదేశంలో హైదరాబాద్ విలీనానికి స్ఫూర్తి అయ్యిందని సర్దార్ పటేల్ పాత్రచేత చెప్పించినా, సగటు ప్రేక్షకుడికి మనసు నిండదు.

ఒకప్పటి "లగాన్" శైలి కొంత కనిపిస్తుంది. "ఛావా"లో హీరోకి తనకి తాను చిన్నపిల్లవాడిగా కనిపిస్తున్న కల, అందులో తండ్రి వాయిస్ వినిపించడం అనె ట్రాక్ ఉంది.. దానిని కూడా ఇందులో వాడారనిపిస్తుంది. ఇతర చిత్రాల నుంచి స్ఫూర్తి పొందడంలో తప్పు లేదు. అయితే ఓవరాల్ గా ఎమోషన్ అందాలి.

ఇందులో పెద్ద లోపమేమిటంటే, ఏ ఎపిసోడ్ ఎంత సేపు చెప్పాలో తూకం మిస్సవడం. ఆ తర్వాత హీరో, హీరోయిన్ మధ్యన మనసుకి హత్తుకునేంత ప్రేమకథలేకపోవడం. ఈ రెండూ కుదిరి ఉంటే సినిమా నిడివి తగ్గి స్క్రీన్ ప్లే పాకన పడి ఉండేది, చక్కని ఎమోషనల్ ఫీల్ కూడా వర్కౌట్ అయ్యి ఉండేది.

బాగానే చూపించాడు.

అనస్వర రాజన్ చూడడానికి బాగుంది. నటనాప్రతిభ కూడా ఉన్నంతలో పర్వాలేదనిపించింది. అయితే ఆమె నుంచి అరెస్టింగ్ పర్ఫార్మెన్స్ చూడడానికి దర్శకుడు పెద్దగా స్కోప్ ఇవ్వలేదు.

వెన్నెల కిషోర్, కోవై సరళ ప్రథార్ధంలో కాసేపు వచ్చే పాత్రలు. రచ్చ రవి, మురళీధర్ గౌడ్ తదితరులు తమ ఉనికి చాటుకునేంత పాత్రల్ని పోషించారు. చాలాకాలం తర్వాత కనిపించిన కళ్యాణ చక్రవర్తికి ఈ పాత్ర నప్పినా, యాస తేడా కొట్టింది. దుల్కర్ సల్మాన్ ది సింగిల్ సీన్ కేమియో!

ఒక స్పెషల్ సాంగులో కనపడింది.

సర్దార్ పటేల్ గా ప్రకాష్ రాజ్, ఖాసిం రజ్వీ గా కెకె మీనన్, సుందరయ్యగా మురళిశర్మ, షోయబుల్లా ఖాన్ గా రవీంద్ర విజయ్.. ఇలా చారిత్రాత్మకమైన పాత్రల్ని కథలోకి కలిపడం బాగానే ఉంది. కానీ మొత్తం ప్రెడిక్టెబుల్ గా ప్రధాన కథ నడవడం వల్ల, మరీ ముఖ్యంగా ద్వితీయార్ధంలో ఎడతెగని డ్రామా వల్ల అనుభూతి కలగదు.

చివరగా చెప్పాలంటే, ఒక ఫుట్ బాల్ ఆటగాడు దారి తప్పి ఒక గ్రామానికి చేరడం వల్ల, అతని జీవితం ఏ దారి తీసుకుందనే ఈ చిత్రకథ. దేశభక్తి, త్యాగం, ఐకమత్యం లాంటి గుణాలన్నీ ఫోర్స్డ్ గా చెప్పిన కథనం. ప్రధాన కథలో రొమాంటిక్ ట్రాక్, హీరోయిన్ డ్రామా ఎపిసోడ్ వినోదం కోసం బలవంతంగా పెట్టినట్టు అనిపిస్తుంది తప్ప ఆర్గానిక్ గా మిక్స్ అవ్వదు. కనుక "గిర గిర.." పాట చూసి ఇందులో కావాల్సినంత వినోదం, లవ్ స్టోరీ ఉందనుకుంటే పొరపాటే. ఇది ప్రెడిక్టెబుల్ కథనంతో సాగే ఒక సుదీర్ఘ సాయుధపోరాట గాథ. ఫుట్ బాల్ "ఛాంపియన్" గా తెర మీద హీరో గోల్ కొట్టాడు కానీ, ఈ చిత్రం మాత్రం ప్రేక్షకుల మనసు అనే గోల్ ని కొట్టలేకపోయింది.

# ఐతం కళాశాలకు శిరో గుర్తింపు కొనసాగింపు



డైరెక్టర్ ప్రొ. వి. వి. నాగేశ్వరరావు

**నవతరం టెక్కలి**

స్థానిక టెక్కలి ఆదిత్య ఐతం కళాశాలకు ఉన్న శాస్త్రీయ మరియు పారిశ్రామిక పరిశోధనా సంస్థ (సైంటిఫిక్ - ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైషన్ (శిరో) గుర్తింపును భారత ప్రభుత్వానికి చెందిన శాస్త్రీయ మరియు పారిశ్రామిక పరిశోధన విభాగం 30 మార్చి 2028 వరకు పొడిగించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ గుర్తింపు కొనసాగింపుతో ఐతం కళాశాలలో జరుగుతున్న శాస్త్రీయ పరిశోధనలు, పరిశ్రమలతో అనుసంధానమైన పరిశోధనా కార్యక్రమాలు, నూతన ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం లభించనుందని తెలిపారు. అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు చేస్తున్న నాణ్యమైన పరిశోధనా కృషికి ఇది గుర్తింపుగా నిలుస్తుందన్నారు. ఈ గుర్తింపు కొనసాగడం వలన జాతీయ స్థాయిలో పరిశోధన ప్రాజెక్టులు, పరిశ్రమల సహకారం, ఆవిష్కరణల అభివృద్ధి మరియు పరిశోధన నిధుల సాధనలో ఐతం కళాశాల మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో డైరెక్టర్ తోపాటు ప్రిన్సిపాల్ డా ఎ ఎస్ శ్రీనివాసరావు, డీన్ ఆర్ అండ్ డి డా డి శ్రీరాములు, డీన్ ఐ క్యు డా సి హెచ్. రమేష్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

# హెడ్ పోస్టాఫీసులో ఖాతాదారుల అసహనం

## సేవింగ్ కౌంటర్లు రెండున్నా ఒకటే పనిచేసింది



**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీసులో రెండు ఎస్ బి కౌంటర్లున్నప్పటికీ ఈ రోజు మాత్రం ఒక కౌంటర్ మాత్రమే పనిచేస్తుంది. కౌంటర్ క్లోజ్ అంటూ ప్రకటించారు. ఒకే కౌంటర్ పనిచేయడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్ద లైన్ ఉండడం, లైన్‌లో వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురిఅయ్యారు. సంబందిత అధికారి సంబందిత క్లర్క్ శెలువు పెట్టినప్పుడు ఆ కౌంటర్‌లో ఇంకో క్లర్క్‌కు పెట్టాల్సిందని సీనియర్ సిటిజన్లు అంటున్నారు. రెండు కౌంటర్లు పనిచేయాల్సింది ఒకే కౌంటర్ పనిచేయడంతో ఇద్దరు చేయాల్సిన పని ఒకరు చేయడం వలన తీవ్ర ఆలస్యం నెలకొంది. ఏది ఏమైనప్పటికీ ఖాతాదారులకు మంచి సేవలు అందాల్సింది పోయి ఇలా గంటల తరబడి క్యూలో నిలబెట్టారని వాపోయారు. రెండు కౌంటర్లు పనిచేసేలా ప్రత్యన్మయ ఏర్పాట్లు చేయాలని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదని పోస్టాఫీసు ఖాతాదారులు కోరుతున్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత

**నవతరం-పోలాకి**



ఈ రోజు పోలాకి మండలం, కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి గారు ప్రజా దర్బార్ నిర్వహించి,ప్రజల నుండి వినతులను స్వీకరించారు. నియోజకవర్గ నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత సమస్యలను, గ్రామాల సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు ప్రజల వినతులను సావధానంగా విని, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఫోన్లో ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ప్రజల ముంగిటకే పాలనను తీసుకువెళ్లి,ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే మా కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.
ఈ కార్యక్రమంలో సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# త్వరితగతిన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాము పూర్తి చేయాలి

## వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**నవతరం-శ్రీకాకుళం**

సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన సముదాయము నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నూతనముగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టర్ కార్యాలయ భవనాన్ని ( ఐసిసి) ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, రోడ్లు భవనాలు శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, భవనాల నిర్మాణం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యాలయంలో ఏర్పాటు చేయుచున్న




నమూనా ఏర్పాట్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

# ప్రభుత్వం తక్షణమే రైతుల వద్ద ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

- 82 కేజీల ధాన్యం ఒప్పందాన్ని అమలు చేయాలి.
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం.

**నవతరం-పాలకొండ**

జిల్లాలో రైతుల పండిస్తున్న ధాన్యం నాణ్యత ప్రమాణాలు లేవని పేరు చెప్పి రైతుల నుండి ధాన్యాన్ని అడ్డంగా దోచుకుంటున్నారు.
దీనిపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ మధ్యకాలంలో జరిగిన ఆందోళన పోరాటం సందర్భంగా గౌరవ జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు పాలకొండ సబ్ కలెక్టర్ గారి వద్ద జిల్లా సమితి నాయకత్వం ధాన్యం రైతుల పడుతున్న బాధలను వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడం జరిగింది.
మిల్లర్స్ సిండికేట్ గా మారి 84 కేజీలు ఇస్తే గాని కుదరదు అని చెప్పి నేడు మరింత రెచ్చిపోయి గుండ అయిపోతున్నాయనే పేరుతో 88 కేజీలు కూడా అడుగుతున్నారు.మిల్లరు రైతును స్వయంగా రప్పించుకొని బేర సారాలు నడిపి చివరికి వారు అనుకున్న ధాన్యాన్ని రైతుల నుంచి బలవంతంగా తీసుకుంటున్నారు. ధాన్యం ఏ మేరకు ముక్క అవుతున్నాయో తెలిపే పరికరాలను రైతు సేవా కేంద్రాలు వద్ద ఉన్నప్పటికీ వాటి ఫలితాలను మిల్లర్లు అంగీకరించడం లేదు. మరి అలాంటప్పుడు దేనికి ఈ పరికరాలు.అలాంటప్పుడు ఆ పరికరాలను తొలగించండి.రైతుల ధాన్యం పూర్తిగా ముక్క అయిపోతున్నాయని మిల్లర్లకు తీవ్రంగా నష్టం జరిగిపోతుందని ఆ లోటును




లారీలను అన్లోడ్ చేస్తున్నారని ఈ పద్ధతి సమంజసం కాదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడిటతి అప్పలనాయుడు తప్పుపట్టారు.
అనుకున్న ప్రకారం 82 కేజీల ఒప్పందాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
సాంకేతిక సమస్య వల్ల బీజేల ప్రాప్తికి ధాన్యం సేకరణ జరగడంలేదని ప్రభుత్వం అనుమతిస్తేనే ధాన్యం సేకరణ చేయగలమని మిల్లర్లు చెప్తున్నడంతో రైతులలో ఆందోళన పెరుగుతుందని ఇప్పటికే సంక్రాంతి పండుగ దగ్గర పడిన నేపథ్యంలో రైతుల కుటుంబాలు పండగ సంతోషాన్ని పొందగలమో లేదని భయం పట్టుకుందని ఇది ఇలా ఉండగా ట్రక్ క్షీట్లతో సంబంధం లేకుండా జిల్లాలో మిల్లర్స్ మిల్లుల వద్ద స్టాక్ చేసుకుంటున్నారని ఇది రైతులలో మరింత కలర పెడుతుందని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గురుబిల్లి అప్పలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రభుత్వం మిల్లర్ల డిపాజిట్లు (బీజేల)ను పెంచడంతోపాటు రైతుల వద్ద ఉన్న ధాన్య సేకరణ వేగవంతం గొర్లి వెంకట జగన్నాథరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
దీనిపై మరోసారి గౌరవ సబ్ కలెక్టర్ వారిని కలిసి తదుపరి అవసరాన్ని బట్టి కార్యాచరణ చేపట్టాలని సమావేశం నిర్ణయించింది.
ఈ సమావేశంలో సంఘం ఆఫీస్ బ్యానర్ బాత్స గౌరు నాయుడు, కిమిడి రామ్మూర్తి నాయుడు, సంఘం నాయకులు బి.వి.రమణ, యాందవ సూరిబాబు తదితరులు ఉన్నారు.

# 28న 5కె మారథాన్ రన్

- దేశ వ్యాప్తంగా 100 సెంటర్ల లో..
- శ్రీకాకుళం లో 80 అడుగుల రోడ్ నుంచి ప్రారంభం..
- గిన్నిస్ బుక్‌లో నమోదు కానున్న వైనం..
- స్వచ్ఛ భారత్ అవగాహన నేపథ్యంలో..
- రిజిస్ట్రేషన్ సొమ్ము కార్పొరేషన్ కార్యాలయానికి అందజేత..

**నవతరం-శ్రీకాకుళం**

అరసవల్లి, స్వచ్ఛ భారత్ పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకుదేశవ్యాప్తంగా ఈ నెల 28న కిషన్ డైమండ్ అండ్ జ్యూయలర్స్ ఆధ్వర్యంలో 5కె మారథాన్ రన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
ఈ మేరకు శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు హాల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా 100 సెంటర్లలో, 2లక్షల మందితో ఉదయం గంటలకు ఈ మారథాన్ రన్ జరుగుతుందన్నారు. దేశ ప్రధానినరేంద్రమోడీ ప్రేరణతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నగరంలో స్థానిక 80 అడుగుల వద్ద ప్రారంభమై పాత బస్టాండు, ఏడరోడ్ల కూడలి.




సూర్యమహల్ జంక్షన్ మీదుగా మిల్లు జంక్షన్ నుండి 80 ఆడుగుల రోడ్డులో గల ఆనందమయి వరకు ఈ రన్‌జరుగుతుందన్నారు.
ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు రూ.500లు రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించి పాల్గొంటున్నారని, ఇంతవరకు 526 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన మొత్తం సొమ్ముస్వచ్ఛ భారత్ కార్యక్రమానికి ఆయా జిల్లాల మున్సిపల్ కార్పొరేషన్లకు అందించడం జరుగుతుందన్నారు.
ఈ మారథాన్ రన్లోగెలుపొందిన పురుషులు, స్త్రీలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను కేంద్రమంత్రి, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయడం జయగుతుందన్నారు.
ఈ సందర్భంగా మారథాన్ రన్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పివి.రమణ, పి.శ్రీనివాసరావు, సిహెచ్.రాజ్కుమార్, వి.మహేష్, పొన్నాడ సంజీవరావు, కిషన్ డైమండ్స్ ప్రతినిధి జి.కోటేశ్వరరావులు, కె.హర్షతదితరులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**